# సాక్షి నిజామాబాద్

శనివారం । 3 । ఆగస్టు । 2024






**ఉత్పత్తిపై 'మీన'మేషాలు**

ఎస్సారెస్పీ జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఉత్పత్తి ప్రక్రియ ఈ యేడు ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

- 8లో ▸



**'మహాలక్ష్మి'తో ఆదాయం**

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి నిజామాబాద్ రీజియన్‌లో రూ. 143 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఎం తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /23.3

**వాతావరణం**

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### పెరిగిన మద్దతు ధర ప్రకారమే వరి కొనుగోళ్లు

**డొంకేశ్వర్(ఆర్మూర్):** ఇటీవల కేంద్ర ప్రభుత్వం వరికి పెంచిన మద్దతు ధర ప్రకారమే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి శుక్రవారం ప్రభుత్వ ఉత్తర్వులు అందాయి. వరికి క్వింటాలుకు మద్దతు ధర రూ. 117 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం జూన్‌లో నిర్ణయం తీసుకోగా, పూర్తి మద్దతు ధర రూ. 2,320కి చేరింది. అలాగే కామన్ రకానికి రూ. 2,300 మద్దతు ధరను రైతులకు చెల్లించనున్నారు. జిల్లాలో వరిసాగు 4.50లక్షల ఎకరాల్లో సాగవుతోంది.

### ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ బదిలీ



**డొంకేశ్వర్(ఆర్మూర్):** జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ యస్మిన్ భాషా ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్ ఉద్యానశాఖ అధికారిగా జిల్లాకు వచ్చిన మూడు నెలలకే బదిలీ కావడం గమనార్హం. అయితే నూతన ఉద్యానశాఖ అధికారిగా కరీంనగర్‌లో పని చేస్తున్న శ్రీనివాస్ జిల్లాకు వస్తున్నారు. ఈ నెల 5న బాధ్యతలు చేపట్టనున్నారు.

### దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలి

**నిజామాబాద్‌నాగారం:** ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభలో వీధిరౌడీలా వ్యవహరించిన తీరు జుగుప్సాకరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు విషయ అవగాహన లేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, సభా మర్యాదలను, సభా గౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ మంటగలిపిందని విరుచుకుపడ్డారు. యథారాజా తథా ప్రజా అన్నట్టు ముఖ్యమంత్రి ప్రవర్తనకు ఏ మాత్రం తగ్గకుండా వారి ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**'అది బోగస్ క్యాలెండర్'**

కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా శాసనసభలో ఇవాళ రిలీజ్ చేసింది జాబ్ క్యాలెండర్ కాదని.. జాబ్‌ల సంఖ్యే లేని బోగస్ క్యాలెండర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌పై సభలో చర్చ జరపాలని కోరితే కేవలం తేదీలు ప్రకటించి తప్పించుకున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లక్షా 63వేల ఉద్యోగాలు గతంలో ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాల నియామక పత్రాలు కూడా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్లని గుర్తు చేశారు.

### కామారెడ్డి డీఆర్డీవోగా సురేందర్

**కామారెడ్డి క్రైం:** కామారెడ్డి డీఆర్డీవోగా సురేందర్ నియమితులయ్యారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న ఆయనను కామారెడ్డి డీఆర్డీవోగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. డీఆర్డీవో పోస్టు కొన్నాళ్లుగా ఖాళీగా ఉంది. జెడ్పీ సీఈవో చందర్ నాయక్ ఇన్‌చార్జి డీఆర్డీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# బిందుసేద్యానికి ప్రోత్సాహం





- రాయితీపై యూనిట్లు ఇవ్వనున్న సర్కారు
- పసుపు, మక్క, కూరగాయలు, పండ్ల తోటలకు వర్తింపు
- ఉద్యాన శాఖకు లక్ష్యాలను నిర్దేశించిన ప్రభుత్వం
- జిల్లాకు రూ. 11.55కోట్లు కేటాయింపు

**డొంకేశ్వర్(ఆర్మూర్):** పంటలు సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన శాఖ శుభవార్త చెప్పింది. ఆయిల్‌పాం పంటకు మాత్రమే రాయితీపై ఇస్తున్న బిందుసేద్యం యూనిట్లను ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ వెల్లడించారు. 2024–25 సంవత్సరానికి గాను సూక్ష్మ నీటిసేద్య పథకం కింద వివిధ పంటలకు లక్ష్యాలు ఖరారయ్యాయని, ఇందుకు జిల్లాకు రూ. 11.55కోట్లు కేటాయింపబడినట్లు పేర్కొన్నారు. సబ్సిడీపై అందజేసే ఈ బిందుసేద్యం యూనిట్లు ఆయిల్‌పామ్‌తో పాటు పసుపు, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటలకు సబ్సిడీ బిందుసేద్యం యూనిట్లు వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. అయితే, వరి తప్ప మిగతా అన్ని పంటలకు బిందుసేద్యం యూనిట్లు ఇవ్వాలని కొన్నేళ్లుగా రైతులు కోరుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పంటలకు కూడా బిందుసేద్యం యూనిట్లు ఇచ్చి రైతులను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకోవడంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ బిందుసేద్యం కోసం ఎదురుచూస్తున్న వారికి ఇదొక మంచి అవకాశమనే చెప్పవచ్చు.

**పంటలకు నిర్దేశించిన లక్ష్యాలు**

| పంట పేరు | ఎకరాలు | నిధులు(రూ.ల్లో) |
|---|---|---|
| ఆయిల్‌పాం | 1,250 | 2.45 కోట్లు |
| పసుపు, మక్క, కూరగాయలు | 1,593 | 8.69 కోట్లు |
| పండ్ల తోటలు | 118 | 25 లక్షలు |
| స్ప్రింక్లర్స్ | 85 హెక్టార్లు | 16 లక్షలు |

**ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరుశాతం రాయితీ**

బిందుసేద్యం యూనిట్లను రైతులకు రాయితీపై అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరుశాతం రాయితీపై ఇవ్వనున్నారు. బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, మిగతా రైతులకు 80 శాతం సబ్సిడీ యూనిట్లను ఇవ్వనున్నారు. అయితే రైతులు ఏ వర్గానికి చెందినవారైన సరే యూనిట్లు పొందే సమయంలో జీఎస్టీని మాత్రం వారే భరించాల్సి ఉంటుంది. బిందుసేద్యం యూనిట్లు కావాల్సిన రైతులు స్థానిక ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఎన్ని ఎకరాలకు బిందుసేద్యం అవసరం అవుతుందో అధికారులు సర్వే చేస్తారు. తర్వాత రైతులు ఎంపిక చేసుకున్న కంపెనీ ప్రతినిధులు ఎన్ని యూనిట్లు అవసరమవుతాయో అంచనాలు రూపొందించి అధికారులకు ఇస్తారు. జిల్లా ఉద్యానశాఖ అధికారులు రైతుల దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ ద్వారా పరిపాలన అనుమతులు తీసుకుని బిందుసేద్యం యూనిట్లను మంజూరు చేస్తారు.

**రైతులు సంప్రదించాల్సిన అధికారులు వివరాలు**

| పేరు | మండలాలు | ఫోన్ నం |
|---|---|---|
| వినాయక్ | బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల | 8977713982 |
| సుమన్ | జక్రాన్‌పల్లి, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్ | 8977713981 |
| సంధ్యారాణి | ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్ సౌత్ | 8977713978 |
| రోహిత్ | ఆర్మూర్, ఆలూరు, డొంకేశ్వర్, మాక్లూర్, నందిపేట్ | 8977713980 |
| వహీద్ జమ | బోధన్, సాలూర, రుద్రూర్, చందూర్, పొతంగల్, వర్ని, నవీపేట్, ఎడపల్లి, వర్ని, కోటగిరి | 8977713979 |

# యువజన కాంగ్రెస్ ఎన్నికల హడావుడి



- జిల్లా అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ
- ఆన్‌లైన్‌లోనే సభ్యత్వాలు, నామినేషన్లు, ఓటింగ్ ప్రక్రియ
- ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఆన్‌లైన్‌లో ప్రక్రియ

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** కాంగ్రెస్ పార్టీలో కీలకమైన యూత్ కాంగ్రెస్ పదవుల ఎన్నిక ప్రక్రియ నడుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ, భావి నాయకులుగా ఎదగాలనుకునే యువజన కాంగ్రెస్ నాయకులు కీలకమైన పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ పదవుల కోసం బరిలో నిలిచేవారు ఆన్‌లైన్‌లోనే నామినేషన్లను దాఖలు చేయాలి. సభ్యత్వాలు, ఓటింగ్ ప్రక్రియ సైతం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు.

రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులు, నియోజకవర్గ, మండల అధ్యక్ష పదవుల ఎన్నికకు ఆన్‌లైన్‌లోనే ఓట్లు వేయాల్సి ఉంటుంది.

సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు మొత్తం 6 ఓట్లు వేయాల్సి ఉంటుంది. కాగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ గత నెల 23న పూర్తయింది. ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు సభ్యత్వ నమోదు, ఓటింగ్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగనుంది. ఓటింగ్ పూర్తయ్యాక వచ్చే నెల రెండోవారంలో ఢిల్లీలోని పార్టీ ఎన్నికల పర్యవేక్షణ విభాగం ఫలితాలను ప్రకటిస్తుంది. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా ఢిల్లీలోని సదరు విభాగమే పర్యవేక్షణ చేయనుంది. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారికి మాత్రమే యువజన కాంగ్రెస్ సభ్యత్వంతో పాటు పోటీ చేసే అవకాశం ఉంది.

**నియోజకవర్గ, మండల అధ్యక్ష పదవులకు సైతం..**

యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి భవిష్యత్తులో పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉండడంతో ఈ పదవులకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటోంది. నియోజకవర్గ, మండల అధ్యక్ష పదవులకు సైతం ఆన్‌లైన్‌లోనే ఓటింగ్ ప్రక్రియ ఉంది. ఈ పదవుల కోసం నామినేషన్లు దాఖలు చేసిన యువ నాయకులు సోమవారం నుంచి సభ్యత్వాలు నమోదు చేయించి ఓటింగ్ వేయించుకునేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే సదరు నామినేషన్లు వేసిన యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు ప్రతిరోజూ ఫోన్లు చేస్తున్నారు.

■ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం బరిలో దిగిన వారిలో విపుల్‌గౌడ్, అబ్దుల్ అద్నాన్, నాగేంద్రబాబు, నరేష్, శ్రీకాంత్, సాయికిరణ్ ఉన్నారు. విపుల్‌గౌడ్ ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా పనిచేశాడు. రాహుల్‌గాంధీ ఆకాంక్షల మేరకు ఏర్పాటు చేసిన పార్టీ 'శక్తి ప్రాజెక్ట్' జిల్లా బాధ్యుడిగానూ విపుల్‌గౌడ్ వ్యవహరించాడు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా చేశాడు. ప్రస్తుతం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నాడు. అబ్దుల్ అద్నాన్ యువజన కాంగ్రెస్‌లో కొన్నేళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. నాగేంద్రబాబు బాల్కొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశాడు. శ్రీకాంత్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశాడు. నరేష్ నిజామాబాద్ రూరల్ అధ్యక్షుడిగా పనిచేశాడు. సాయికిరణ్ సైతం యూత్ కాంగ్రెస్‌లో పనిచేస్తున్నాడు.

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- 'స్వచ్ఛదనం–పచ్చదనం'లో నిర్వహణ లోపాలు ఉండొద్దు
- అత్యవసరమైతే తప్ప సెలవులు తీసుకోవద్దు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

**సుభాష్‌నగర్:** 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమం ఈనెల 5 నుంచి 9వరకు కొనసాగనున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఆయా శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని సూచించారు. కలెక్టరేట్ సముదాయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛదనం– పచ్చదనంపై సమీక్ష నిర్వహించారు. అన్ని జీపీలు, మున్సిపల్ పట్టణాల్లోని వార్డుల్లో ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలియజేశారు. జీపీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, ఆశా కార్యకర్త, వీవోలతో కమిటీని ఏర్పాటు చేసుకుని నిర్దేశిత కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. యువత, పాఠశాలల హెచ్‌ఎంలు, మెడికల్ ఆఫీసర్లను కూడా కమిటీలో ప్రాతినిధ్యం కల్పించవచ్చని సూచించారు. అధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పని చేయాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ సెలవులు పెట్టకూడదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. జిల్లా స్థాయి అధికారులు ఆకస్మికంగా సందర్శించిన సమయాల్లో నిర్వహణపరంగా లోపాలుంటే, సంబంధిత అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, జెడ్పీ సీఈవో ఉష, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో చక్రవర్తుల తరుణ్‌కుమార్, డీఐఈవో రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిరోధానికి కృషి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- నషా ముక్త్‌భారత్ అభియాన్ జిల్లా కమిటీ సమావేశం
- టోల్ ఫ్రీ నెంబర్ 14446కు సమాచారం అందించాలని పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన సీపీ కల్మేశ్వర్, అధికారులు

**సుభాష్‌నగర్:** మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కమిటీ ప్రతినిధులు పాల్గొని, జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పెనుసవాలుగా మారిందన్నారు. యువత, విద్యార్థుల జీవితాలు నాశనం చేస్తు న్న మత్తు పదార్థాలు రవాణా, వినియోగం జరగకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ యంత్రాంగాల బాధ్యత అని భావించకుండా సమా జంలోని వివిధ వర్గాల వారందరూ మాదకద్రవ్యాల నిరోధానికి తమవంతు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం గమనిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14446కు సమాచారం తెలపాలని సూచించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ కఠినచర్యలు చేపడుతుండడంతో పరిస్థితిలో కొంత వరకు వినియోగం తగ్గిందని తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఐఈవో, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, విద్యాశాఖ ఏసీ విజయభాస్కర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఎన్‌వైకే సమన్వయకర్త శైలి బెల్లాల్, కమిటీ సభ్యులు ఏ విశాల్, బి కేశవులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి రామ్మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీలోకి 52వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

- ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం
- వేగంగా పెరుగుతున్న నీటి మట్టం

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 52వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. క్రితం రోజు 41వేల క్యూసెక్కులు వచ్చిన వరద శుక్రవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 52వేల క్యూసెక్కులకు చేరుకుంది. ప్రస్తుత సీజన్‌లో ఇంత స్థాయిలో వరద నీరు రావడం ఇదే తొలిసారి. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూక్కులు, ఆవిరి రూపంలో 443 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా శుక్రవారం రాత్రి వరకు ప్రాజెక్టులో 1079.00 అడుగుల (42 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

**సగానికి పైగా నిండిన జలాశయం**

ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి 42 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యంలో సగం కంటే ఎక్కువ నీటి నిల్వకు ప్రాజెక్టు చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులు పూర్తి భరోసా లభించింది. ఇదే వరద నీరు మరో వారం రోజులు కొనసాగితే ప్రాజెక్టు నిండుకుండలా మారే అవకాశం ఉంది.

# నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు

**వేల్పూర్:** నేషనల్ హైవే 63 విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లింపు జరుగుతుందని ఆర్డీవో రాజుగౌడ్ పేర్కొన్నారు. రహదారిలో ఇళ్లు, భూములు కోల్పోతున్న లక్కోర, పడగల్, కుకునూర్ గ్రామాల ప్రజలతో శుక్రవారం వేల్పూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైవే నిర్మాణాన్ని కేంద్రప్రభుత్వం ఖరారు చేసిందని, నష్టపరిహారం పంపిణీ పూర్తికాగానే రోడ్డు విస్తరణ పనులు మొదలవుతాయని తెలిపారు. రోడ్డు విస్తరణ జరిగే భూములకు ప్రభుత్వ పరంగా రిజిస్ట్రేషన్ ప్రకారం ఉన్న ధ రలను వారికి వివరించారు. రోడ్డు పక్కన, వెనుక ఉన్న ఇళ్లు, భూములకు ఖరారు చేసిన రేట్లను తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహా రం సరిపోకపోతే కలెక్టర్‌కు, న్యాయస్థానాలకు ఏ విధంగా అప్పీల్‌కు వెళ్లాలనే అంశాలపై అవగాహన కల్పించారు. తమ గ్రామాల భూములు జాతీయ రహదారి వెంట ఎకరానికి రూ. కోట్ల విలువ ఉందని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం రూ. లక్షల్లో ఉందన్నారు. మీ అభిప్రాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో వెల్లడించారు. అంతకుముందు ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి సమస్యలపై రైతులతో మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ సంతోస్, డిప్యూటీ తహసీల్దార్ సరిత, ఆర్ఐ గోపాల్ పాల్గొన్నారు.



హైవే విస్తరణలో భూములు కోల్పోతున్న బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజుగౌడ్

# బ్యాంకు ఎదుట అన్నదాతల ఆందోళన



రెంజల్‌లోని కెనరా బ్యాంకు వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

**రెంజల్(బోధన్):** బ్యాంకు అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రెంజల్‌లోని కెనరా బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించినా బ్యాంకర్ల నిర్లక్ష్యం వల్ల వందలమంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారని ఆరోపిస్తూ సుమారు 3 గంటల పాటు ధర్నా చేశారు. రెంజల్, వీరన్నగుట్ట, కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. రీజినల్ మేనేజర్‌తో పాటు ప్రభుత్వ అధికారులు వచ్చే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ సమయంలో రుణాలు తీసుకున్నా మాఫీ వర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని.. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల నుంచి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడే ఉంటామని పట్టుబట్టారు. బ్యాంకు మేనేజర్ నాగనాథ్ వచ్చి సాంకేతిక కారణాల వల్ల లోపం జరిగిందని, ఉన్నతాధికారులు తప్పొప్పులను సవరించి ప్రభుత్వానికి నివేదిక అందించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా రైతులు మాట వినకపోవడంతో రెంజల్ ఎస్సై సాయన్న సిబ్బందితో బ్యాంకుకు చేరుకుని పరిస్థితి పరిశీలించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ వచ్చి బోధన్ ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసు కుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు కిషోర్, చుక్కరాజు, పోశెట్టి, గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ దోస్త్‌ ఆన్‌లైన్‌ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్‌ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాలను శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ పరిపాలనా భవనంలో పరిశీలించారు. తెయూ దోస్త్‌ కో– ఆర్డినేటర్‌ సంపత్‌కుమార్‌ ఆధ్వర్యంలో సిబ్బంది రవీందర్‌నాయక్‌, నరేష్‌ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనకు ఎన్‌సీసీ–3, స్పోర్ట్స్‌ –2, పీహెచ్‌సీ (దివ్యాంగులు) కేటగిరికి సంబంధించి ఒకరు హాజరైనట్లు దోస్త్‌ కోఆర్డినేటర్‌ తెలిపారు.

### కొనసాగుతున్న పీజీ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో శుక్రవారం 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. తెయూ మెయిన్‌ క్యాంపస్‌, భిక్కనూర్‌ సౌత్‌క్యాంపస్‌, గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజీ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (బాన్సువాడ)లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1, 3, 4, 7, 9వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలో 200 మంది విద్యార్థులకు 182 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం తెయూ మెయిన్‌ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల్లో నలుగురు విద్యార్థులకు నలుగురు హాజరైనట్లు పేర్కొన్నారు.

# ఉత్పత్తిపై 'మీన'మేషాలు

- ఎస్సారెస్పీ చేపపిల్లల కేంద్రంలో ప్రారంభం కాని ఉత్పత్తి
- నగం సీజన్‌ పూర్తయినా పట్టించుకోని అధికారులు



శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ వద్ద గల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన గల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. సీజన్‌ సగం ముగిసినా ఉత్పత్తి ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా చేప పిల్లల ఉత్పత్తి జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే చేపడుతారు. ఇందులో జూలై గడిచినా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. చేప పిల్లల ఉత్పత్తికి కావాల్సిన సామగ్రి కొనుగోలు చేయడానికి నిధులు లేకపోవడంతోనే ప్రక్రియ ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు. గతంలో నీటి కొరతతో ఉత్పత్తి సకాలంలో కాలేదన్నారు. చేప పిల్లలు ఉత్పత్తి చేశాకా వాటికి దాణా వేయాలి. పశువుల పేడ, పల్లి పిండి, తవుడు లాంటి పదార్థాలను దాణాగా వేస్తారు. ఇంకా కొన్ని వలల అవసరం ఉంటుంది. వీటన్నింటికి కాలిపి రూ.4.5 లక్షలతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ నిధులు ఇప్పటి వరకు విడుదల కాలేదు. నిధులు వస్తేనే చేపపిల్లల ఉత్పత్తి జరుగుతుంది. ఆగస్టు చివరి వరకు మాత్రమే ఉత్పత్తి చేపట్టవచ్చు.

**సగం కూడా కష్టమే..**

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి జిల్లాలోని చెరువులకు, ప్రాజెక్టులకు చేపపిల్లలు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సగం మేర కూడ చేప పిల్లల ఉత్పత్తి కావడం లేదు. ఐదు కోట్ల చేప పిల్లల ఉత్పత్తి సామర్థ్యం ఉంది.

ఐదు కోట్ల చేప పిల్లల ఉత్పత్తి కావాలంటే 16 కోట్ల స్పాన్‌ను ఉత్పత్తి చేయాలి. కానీ ప్రస్తుతం అంత సమయం కూడా లేదు. ఈ కేంద్రంపై ప్రత్యేక రాష్ట్రంలో కూడా నిర్లక్ష్యం వీడటం లేదు. దీంతో లక్ష్యానికి అనుగుణంగా ఏ సంవత్సరం కూడా ఉత్పత్తి కావడం లేదు. చేప పిల్లలకు కావాల్సిన దాణా కోసం కూడ నిధులు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేప పిల్లలను మత్స్య సహకార సంఘాల ద్వారా చెరువుల్లో ఉచితంగా వదులుతారు. కానీ నిర్లక్ష్యం మూలంగా పూర్తిగా చెరువులకు కూడా సరఫరా కావడం లేదు. పాలకులు స్పందించి వెంటనే నిధులను విడుదల చేసి చేపపిల్లల ఉత్పత్తిని ప్రారంభించాలని మత్స్యకారులు డిమాండ్‌ చేస్తున్నారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఉత్పత్తి కోసం రూ.4.5 లక్షల నిధులు అవసరం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే ఉత్పత్తిని ప్రారంభిస్తాం.
>
> – దోలిసింగ్‌, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్‌

# పాపం పీటీపీలు

- ఏడాదిగా అందని వేతనాలు
- ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని చిరుద్యోగుల ఆవేదన
- జిల్లాలో 70 మందికి మిగిలింది 39 మందే..

మోర్తాడ్‌(బాల్కొండ): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌ టైం ప్యూన్‌(పీటీపీ)లకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదు. నాల్గో తరగతి ఉద్యోగుల స్థానంలో పీటీపీలను నియమించి వారితో పాఠశాలల్లో విధులను నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొదట్లో 70 మంది పీటీపీలు ఉండగా కొందరు చనిపోవడం, మరి కొందరు పదవి విరమణ పొందడంతో ప్రస్తుతం 39 మంది మిగిలారు. వీరు తమకు కేటాయించిన పాఠశాలల్లో ఉదయం ఊడ్చి, తాగునీటిని ఏర్పాటు చేయడం, గదులను శుభ్రం చేయడం వంటి పనులను చేస్తున్నారు. పేరుకు పార్ట్‌ టైం ఉద్యోగులే అయినా పాఠశాల మొదలైన నుంచి తరగతులు ముగిసే వరకు పని చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.4,500 వేతనం చెల్లిస్తున్నారు. తమ శ్రమకు తగిన వేతనం కాకపోయినా ఏళ్ల తరబడి ప్రభుత్వాన్ని నమ్ముకుని పని చేస్తున్నామని ఏదో ఒకరోజు వేతనాలు పెంచుతారనే ఆశతో ఉన్నామని ఉద్యోగులు చెబుతున్నారు. జిల్లా పరిషత్‌ నిధుల నుంచి పీటీపీలకు వేతనాలు చెల్లిస్తున్నారు. తమ వేతనాల కోసం జిల్లా పరిషత్‌ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ఎలాంటి ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సైతం వినతి పత్రం సమర్పించినప్పటికీ ఎవరూ స్పందించలేదని పీటీపీలు వెల్లడించారు. ఉద్యోగభద్రత లేకపోవడం, శ్రమకు తగిన వేతనం చెల్లించకపోయినా పని చేస్తున్న తమకు నెలల తరబడి వేతనం చెల్లించకుండా వేధిస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్‌, కాంట్రాక్ట్‌ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా ప్రతి నెలా వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని పీటీపీలు కోరుతున్నారు.

> **పూట గడవడం లేదు..**
>
> ఏడాది కాలంగా వేతనం చెల్లించకపోవడంతో పూట గడవడం కష్టంగా ఉంది. ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్నా వేతనాలు ఎందుకు చెల్లించడం లేదో అర్థం కావడం లేదు. జిల్లాలోని ఉన్నతాధికారులు అందరిని కలిసి మా గోడును వెళ్లబోసుకున్నాం. అయినా ఎలాంటి స్పందన రావడం లేదు.
>
> – సరోజన, పార్ట్‌ టైం ప్యూన్‌, మోర్తాడ్‌

# మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న అధికారులు, విద్యార్థులు

నిజామాబాద్‌ అర్బన్‌: మొక్కలు నాటి సంరక్షించాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఫీల్డ్‌ పబ్లిసిటీ ఆఫీసర్‌ ధర్మనాయక్‌ అన్నారు. నిజామాబాద్‌ ఆకాశవాణి ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ధర్మ నాయక్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు అమ్మ పేరిట మొక్క నాటాలని సూచించారు. ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ మోహన్‌ దాస్‌, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్‌ బిఎస్‌ మీనా, ఫీల్డ్‌ పబ్లిసిటీ అసిస్టెంట్‌ రసీద్‌, దూరదర్శన్‌ రిపోర్టర్‌ బొబ్బిలి నర్సయ్య, సీబీసీ ఎంటీఎస్‌ పోచయ్య పాల్గొన్నారు.

# 'మహాలక్ష్మి'తో రీజియన్‌కు రూ.143కోట్ల ఆదాయం



మాట్లాడుతున్న ఆర్‌ఎం జానీరెడ్డి

ఖలీల్‌వాడి: మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ నిజామాబాద్‌ రీజియన్‌కు రూ.143.56 కోట్ల ఆదాయం వచ్చిందని ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని రీజియన్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌ 9 నుంచి జూలై 31 నాటికి 3.82 కోట్ల కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. బస్సుల సంఖ్య పెరగడంతో రద్దీ తగ్గిందన్నారు. వీకెండ్స్‌, పండుగ సమయాల్లోనే బస్సులో రద్దీ కనిపిస్తోందన్నారు. మిగితా రోజుల్లో సాధారణ పరిస్థితే ఉంటోందని చెప్పారు. ప్రయాణికుల కోసం నిజామాబాద్‌ నుంచి బెంగుళూరు, తిరుపతి, తెనాలి, నెల్లూరు, ఒంగోలు– వింజమూరు లాంటి దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వివాహాలు, శుభకార్యాలకు బస్సులను అద్దెకు ఇస్తున్నామని చెప్పారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు సరస్వతి, శంకర్‌, డిపో మేనేజర్‌ ఆనంద్‌ పాల్గొన్నారు.

## సుదర్శన్‌రెడ్డికి సీఎం జన్మదిన శుభాకాంక్షలు



సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు



సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి: బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డికి సీఎం రేవంత్‌ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీలోగల సీఎం ఛాంబర్‌లో శుక్రవారం సుదర్శన్‌రెడ్డి సీఎంను కలిశారు. ఈసందర్భంగా ఆయన సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శు భాకాంక్షలు తెలిపారు. అలాగే అసెంబ్లీ లా బీంగ్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపా రు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, సీఎం సలహాదారులు వేం నరేందర్‌ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మానాల మోహన్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

### నిఖత్‌కు ఉద్యోగంపై ఎమ్మెల్సీ హర్షం



నిజామాబాద్‌ నాగారం: నిజామాబాద్‌కు చెందిన నిఖత్‌ జరీన్‌కు ప్రభుత్వం గ్రూప్‌–1 ఉద్యోగంతో పాటు 600 గజాల ఇంటి స్థలం ఇవ్వడంపై ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ హర్షం వ్యక్తం చేశారు. ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిఖత్‌ తండ్రి తనకు సన్నిహితుడని, ఆయన ఎంతో శ్రమించి ఆమెను క్రీడాకారిణిగా తయారు చేశారన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్కిల్‌ యూనివర్సిటీతో విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు.



## క్రైం కార్నర్‌

### చెరువులో పడి ఒకరి మృతి

వర్ని: కోటగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని దోమలేడిగి గ్రామానికి చెందిన గాండ్ల సుదర్శన్‌ (31) ఊర చెరువులో పడి మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్‌ తెలిపారు. చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన సుదర్శన్‌ రెండు రోజుల క్రితం చెరువులో పడినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం మృతదేహం తేలడంతో గ్రామస్తులు గమనించి సమాచారం అందించగా విచారణ చేపట్టామన్నారు. మృతిడి తల్లి దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

### కాలువలో పడి మహిళ..



ఇందల్వాయి: మండలంలోని స్టేషన్‌ తండా పంచాయతీకి చెందిన కాట్రోత్‌ భారతి(43) కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. భారతి కాలకృత్యాలు తీర్చుకోడానికి తండా సమీపంలో ఉన్న కాలువ వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు దరిసింగ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### మలేషియాలో రాంచంద్రపల్లి వాసి..



మాక్లూర్‌: మండలంలోని రాంచంద్రపల్లికి చెందిన శిరసు వెంకట్‌(52) మలేషియాలో అనారోగ్యంతో ఈ నెల 1న మృతిచెందాడు. వివరాలు.. వెంకట్‌ బతుకుదెరువు కోసం మలేషియా వెళ్లాడు. అక్కడ మృతి చెందాడు. మృతదేహాన్ని త్వరగా రప్పించాలని ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### చేపలవేటకు వెళ్లి ఒకరు..

బోధన్‌రూరల్‌: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఎండీ మౌలాన (55) చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతిచెందినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. ఆయన గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం గ్రామ శివారులోని నీటి కుంటలో మృతదేహం కనిపించగా గ్రామస్తులు పోలీసులకు సమచారం అందించారు. చేపలు పట్టడానికి వెళ్లి చనిపోయి ఉంటాడని మృతుని భార్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

### బాలికపై లైంగికదాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ కాలనీలో ఐదున్నర ఏళ్ల చిన్నారిపై అదే కాలనీలో నివాసం ఉంటున్న ఓ మేకల కాపరి(40) లైంగికదాడి చేసినట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. గురువారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### పారిశుధ్య కార్మికురాలిని ఢీకొన్న స్కూల్‌ బస్సు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట్‌లో పారిశుధ్య కార్మికురాలిని స్కూల్‌ బస్సు ఢీకొంది. వివరాలు.. గ్రామానికి చెందిన యంబ లక్ష్మి(58) పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం రోడ్డు ఊడుస్తుండగా కాకతీయ స్కూల్‌ బస్సు ఢీకొంది. ఆమె కాలికి గాయం కాగా నిజామాబాద్‌ తరలించారు. లక్ష్మి కుమారుడు శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

- 15 మంది నుంచి రూ.8.45 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్ట్‌



నిందితుడు ప్రవీణ్‌

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలోని అశోక్‌నగర్‌ కాలనీలో నివాసం ఉండే చిలుక నవీన్‌ ఎంఎస్‌ఎన్‌ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేస్తున్న నుంచు ప్రవీణ్‌ తనకు తెలిసిన వారు చాలా మంది ఉన్నారని, ప్రభుత్వ విభాగాల్లో ఔట్‌ సోర్సింగ్‌ విధానంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నవీన్‌ను నమ్మించాడు. నవీన్‌, అతని భార్య జ్యోతితో పాటు వారి స్నేహితులు, బంధువులు మొత్తం 15 మంది నుంచి ప్రవీణ్‌ మొత్తం రూ.8.45 లక్షలు వసూలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్‌ లెటర్‌లు అంటగట్టాడు. మోసపోయామని గ్రహించి జ్యోతి పట్టణ పోలీసులకు గత నెల 22న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు ప్రవీణ్‌ను మెదక్‌ జిల్లా నిజాంపేట మండలం బచ్చురాజులపల్లి వాసిగా గుర్తించారు. ప్రస్తుతం అతడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. విలాసాలకు అలవాటు పడి తేలికగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు ప్రవీణ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్ట్‌ చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి



రాజేశ్వర్‌ మృతదేహం

కామారెడ్డి క్రైం: నైట్‌ డ్యూటీకి వెళ్తూ బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన డ్రైనేజీని ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ శివారులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం నాగ్లూర్‌ గ్రామానికి చెందిన గైని రాజేశ్వర్‌ (34) భిక్కనూర్‌ మండలం జంగంపల్లి వద్దనున్న ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే గురువారం రాత్రి నాగ్లూర్‌ నుంచి బైక్‌పై నైట్‌ డ్యూటీకని బయలు దేరాడు. 11 గంటల ప్రాంతంలో టేక్రియాల్‌ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు బైక్‌ అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న ఫ్లైవర్‌ బ్రిడ్జి పక్కన డ్రైనేజీని ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని పోలీసులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

**చికిత్స పొందుతూ ఒకరు..**

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ధర్పల్లి మండలం ఎన్‌టీఆర్‌ కాలనీకి చెందిన అల్లం అశోక్‌(33) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. వివరాలు.. అశోక్‌ అతని స్నేహితులు బాబు, లక్ష్మణ్‌తో కలిసి ఇందల్వాయికి పాత సామాను కొనుగోలు కోసం ట్రాలీ ఆటోలో వచ్చాడు. తిరిగి వెళ్తుండగా వారి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ అశోక్‌ను జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**కంటైనర్‌ ఢీకొని యువకుడు..**



ఆనంద్‌ కుమార్‌ (ఫైల్‌)

సదాశివనగర్‌: మండలంలోని కుప్రియాల్‌ శివారు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌ గ్రామానికి చెందిన కట్ట ఆనంద్‌కుమార్‌(29) కొంత కాలంగా ఈకామ్‌ ఎక్స్‌ప్రెస్‌లో డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు.

విధి నిర్వహణలో భాగంగా రెడ్డిపేట్‌ నుంచి సదాశివనగర్‌ వైపు బైక్‌పై వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో వెనుక నుంచి కంటైనర్‌ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆనంద్‌కుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, రెండేళ్ల పాప ఉంది. ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంజిత్‌ తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న ఆటో : ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన బైక్‌

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో పాత జాతీయ రహదారి 44పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నాగాపూర్‌ గ్రామానికి చెందిన అము, అతని భార్య సోని, కుమారుడు ఓంకార్‌ బైక్‌పై ఆర్మూర్‌ నుంచి నాగాపూర్‌ వెళ్తుండగా వెనుక నుంచి టాటా మాజిక్‌ ఆటో ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో బోల్తాపడి సౌత్‌క్యాంపస్‌ విద్యార్థి..



ప్రీతమ్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కామారెడ్డిలోని కొత్త బస్టాండ్‌ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్‌ జిల్లా సాంగ్వి గ్రామానికి చెందిన బేదప్కర్‌ ప్రీతమ్‌ (27) భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఉంటూ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనులపై శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చాడు. అతడు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా థియేటర్‌ రోడ్‌ క్రాసింగ్‌ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి ప్రీతమ్‌ మృతిచెందాడు. పట్టణ పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా ప్రీతమ్‌ తండ్రి రాంకిషన్‌ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ప్రీతమ్‌ మృతితో సౌత్‌క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఖాతాదారుల లోన్లు కాజేసిన బ్యాంక్‌ మేనేజర్‌ రిమాండ్‌

ఖలీల్‌వాడి: ఖాతాదారులకు లోన్లు ఇచ్చి ఆ డబ్బులను కాజేసిన నగరంలోని ఆర్‌ఆర్‌ చౌరస్తా వద్ద గల బడా బజార్‌ యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌ పినపాటి అజయ్‌ కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. అజయ్‌ కొంత మంది కస్టమర్లను నమ్మించి లోన్లు ఇప్పించి వారి వద్ద సుమారు రూ.3 కోట్ల డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ డబ్బులను ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌లో పెట్టినట్లు చెప్పారు. దీంతో పాటు కొంతమంది ఖాతాదారులు షూరిటీ నిమిత్తం ఇచ్చిన చెక్కులను పెట్టుకొని ఖాతాదారులకు తెలియకుండా వారి బ్యాంక్‌ ఖాతాల నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. బాధితుడు పుల్లూరి రాకేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించినట్లు తెలిపారు. అజయ్‌కుమార్‌ను గురువారం సాయంత్రం నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో పట్టుకొని విచారించిన తర్వాత కోర్టులో హాజరు పర్చామని వివరించారు.

### మొరం టిప్పర్‌ పట్టివేత

నవీపేట: మండలంలోని ఫతేనగర్‌ శివారు నుంచి నవీపేట వైపు వసున్న మొరం టిప్పర్‌ను గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్‌ చేశామన్నారు.

### యువకుడి అదృశ్యం



మోపాల్‌: మండలంలోని మంచిప్ప తండాకు చెందిన మాలావత్‌ సంతోష్‌ గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఎస్సై గంగాధర్‌ తెలిపారు. వివరాలు.. సంతోష్‌, ప్రమీల దంపతులు. సంతోష్‌ అటవీ శాఖలో వాచర్‌ (తాత్కాలిక పద్ధతిన)గా పని చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### కాపర్‌ వైర్‌ చోరీ



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం తెల్లవారుజామున దొంగలు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. ఈ ఘటనపై రైతులు మైపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.